క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

అమలాపురం టౌన్: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం కల్యాణ మండపంలో సోమవారం ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆ క్లబ్ జిల్లా గవర్నర్ యెండూరి రాఘవకుమారి తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరిగే ఈ శిబిరంలో రూ.5 వేల విలువైన క్యాన్సర్, గ్యాస్ట్రో, రక్త, కళ్లె పరీక్షలను రోగుల అవసరాలకు అనుగుణంగా ఉచితంగా చేస్తారని వివరించారు. అమలాపురం మెడ్ యునైటెడ్ సహకారంతో శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 92912 56729, 92900 84360 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బార్ అసోషియేషన్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



నాగేశ్వరరావును అభినందిస్తున్న న్యాయవాదులు

ముమ్మిడివరం: స్థానిక బార్ అసోషియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది వడ్డి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ముమ్మిడివరం సివిల్ జడ్జి, కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ కార్యాలయంలో అసోషియేషన్ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా న్యాయవాది కాశి సింహాద్రి వర్మ, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా ఎస్.మున్నేశ్వరరావు వ్యవహరించారు. బార్ అసోసియేషన్‌ఉపాధ్యక్షుడిగా గోనమండ వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా మట్టపర్తి వెంకటేశ్వరరావు, ట్రెజరర్‌గా తిల్లపూడి అర్జునరావు, జాయింట్ సెక్రటరీగా ముడే వెంకట్రావు, లైబ్రేరియన్‌గా గంటి శ్రీధర్ బాబు ఎన్నికయ్యారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు

ఉప్పలగుప్తం: విద్యార్థులకు వేసవి సెలవుల రీత్యా స్థానిక గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులను ఏర్పాటు చేస్తున్నామని, వాటిని విద్యార్థులు వినియోగించుకోవాలని గ్రంథాలయాధికారులు సలాది నాగేశ్వరరావు, నిమ్మకాయల శేషుబాబు కోరారు. సోమవారం జూన్6 వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గ్రంథాలయాల్లో శిక్షణ తరగతులను ఏర్పాటు చేస్తున్నామని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ తరగతుల్లో విద్యార్థులకు ప్రతీ రోజు కథలు చెప్పడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్ వంటివి నేర్పిస్తున్నామని వివరించారు.

ప్రశాంతంగా అసిస్టెంట్ ఉద్యోగాల రాత పరీక్ష

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ పోస్టుల భర్తీ కోసం ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. యానాంలో అయిదు పరీక్షా కేంద్రాలైన ఎంజీజీబీహెచ్ హైస్కూల్, రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హైస్కూల్, ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రీజెన్సీ హైస్కూల్, మెట్టకూరు జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ హైస్కూల్‌లో ఏర్పాట్లు చేశారు. పరీక్ష నిర్వహణను ఆర్ఏఓ మునిస్వామి, అధికారులు పర్యవేక్షించారు. 1,688 మందికి గాను 1,359 మంది పరీక్షకు హాజరైనట్లు 329 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

రిటైర్డ్ ఆర్ఓఏ నామాడికి కందుకూరి పురస్కారం



నామాడికి కందుకూరి విశిష్ట రంగస్థల పురస్కారం అందజేత

యానాం: యానాం రిటైర్డ్ ప్రాంతీయ పరిపాలనాధికారి నామాడి అప్పారావుకు తెలుగు నాటక రంగ దినోత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో ఆదివారం రాత్రి కందుకూరి విశిష్ట రంగస్థల పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. దంటు కళాక్షేత్రంలో నిర్వహించిన ఈ వేడుకల్లో అధికారిగా అనేక ఏళ్ల విధులు నిర్వహించడంతో పాటు నాటకరంగంలో మూడున్నర దశాబ్దాలుగా వివిధ పాత్రలను ధరించి అందరిని అలరించారని, ఆయన రంగస్థలానికి చేసిన సేవలకు గుర్తింపుగా కందుకూరి పురస్కారం అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

కోదండరాముడికి వెండి, బంగారు ఆభరణాల సమర్పణ

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు గొల్లగుంట కొప్పిశెట్టివారిపాలెంలో వేంచేసిన కోదండరామ స్వామికి భక్తుల సమకూర్చిన వెండి బంగారు ఆభరణాలను సమర్పించారు. కొప్పిశెట్టివారిపాలెం, సానబోయినవారి పాలెం గ్రామ ఆడపడుచులు వెండి కిరీటాన్ని సమర్పించారు. అలాగే గ్రామానికి చెందిన కొప్పిశెట్టి ఆనంద రామారావు జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు వెండి నేత్రాలను నామాలను, బంగారు ముక్కుపుడక స్వామివారికి అందజేశారు. అంతకు ముందు ఆలయ చైర్మన్ కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అడుసు తొక్కనేల... కాలు కడగనేల?

- మాస్టర్ ప్లాన్ అమలులో అధికారుల అనాలోచిత చర్యలు
- ప్రస్తుత 56 అడుగుల రోడ్డులో శాశ్వత నిర్మాణాలా?
- మాస్టర్ ప్లాన్ అమలు అంటూ ప్రచారం
- రూ.కోట్లతో ప్రస్తుత రోడ్లపైనే డ్రెయిన్ల నిర్మాణంపై ఆరోపణల వెల్లువ



అమలాపురం గడియారం స్తంభం నుంచి ఈదరపల్లి వంతెన వైపు వెళ్లే మెయిన్ రోడ్డులో మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మిస్తున్న డ్రెయిన్

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ ఓ పక్క మాస్టర్ ప్లాన్ అమలు అంటూ విస్తృత ప్రచారం చేస్తోంది. ఈ ప్లాన్‌తో ప్రస్తుతం పట్టణంలోని ఉన్న రోడ్లు 40 నుంచి 100 అడుగుల వెడుల్పుతో విస్తరిస్తామని స్పష్టం చేస్తోంది. మాస్టర్ ప్లాన్ జీవో, మ్యాప్ విడుదల సమయంలో ఏఏ రోడ్డు ఎంతెంత మేర విస్తరిస్తున్నామో విపులంగా వివరించింది. రానున్న 20 ఏళ్లకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. నిధుల లభ్యతను బట్టి దశల వారీగా రోడ్డు విస్తరిస్తారని పట్టణ ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా రూ.కోట్లతో పలు రోడ్లలో డ్రెయిన్లు నిర్మించేందుకు టెండర్లు పిలవడం, అందులో కొన్ని పనులు మొదలు పెట్టడంతో ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఉదాహరణకు అమలాపురం మెయిన్‌రోడ్డు అయిన గడియారం స్తంభం సెంటరు నుంచి ఈదరపల్లి వంతెన మీదుగా అంబాజీపేట రోడ్డును మాస్టర్ ప్లాన్‌లో 80 అడుగులకు విస్తరించనున్నట్లు ప్రకటించారు. అయితే ప్రస్తుతం ఆ రోడ్డు 56 అడుగుల వెడుల్పుతో ఉంది. ఆ రోడ్డులోనే ఓ వైపు శాశ్వత కట్టడంగా సీసీ డ్రెయిన్ నిర్మిస్తుంటే అసలు మాస్టర్ ప్లాన్ ఉందా... అమలవుతుందా...? అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. ఇది అధికారుల అనాలోచిత నిర్ణయమా? లేక మున్సిపాలిటీకి చెందిన కొందరి ప్రజాప్రతినిధుల స్వార్థమా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇలా పలు రోడ్లను మాస్టర్ ప్లాన్ విస్తరణతో విశాలమైన రోడ్లుగా తీర్చి దిద్దనున్నట్లు అరచేతిలో స్వర్గాన్ని చూపించినట్లు చూపించారు. తీరా వర్తమానంలోకి వెళితే ఇప్పుడున్న రోడ్ల వెడుల్పులకే పరిమితం అవుతూ శాశ్వత సీసీ డ్రెయిన్ల నిర్మాణం ఎంత వరకూ సబబు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కోర్టులను ఆశ్రయిస్తున్న భవన యజమానులు

రోడ్ల వెడల్పు, విస్తరణతో తమ ఇళ్ల కోల్పోతున్న కొందరు భవన యజమానులు కోర్టులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఈ పరిణామాలపై స్పందించారు. 2050 సంవత్సరం వరకూ మాస్టర్ ప్లాన్ అమలు ఉంటుందని, వెంటనే రోడ్ల వెడల్పు చేస్తామన్న ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు మాస్టర్‌ప్లాన్ అమలుపై పెదవి విరిచారు. రోడ్లు వెడల్పు గురించి మాస్టర్ ప్లాన్‌లో ప్రకటించి మళ్లీ మున్సిపాలిటీయే పాత రోడ్డుపై డ్రెయిన్లు నిర్మించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని అన్నారు. మాస్టర్ ప్లాన్ అమలుకు సిద్ధమై ఉంటే పాత రోడ్లపై కోట్లాది రూపాయలతో శాశ్వత కట్టడాలు దేనికని పశ్నించారు. కలెక్టర్ ఈ తప్పిదంపై జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు.

అధికారుల మాటల్లో ఈ వ్యత్యాసం ఏమిటి?

మాస్టర్‌ప్లాన్‌లో గడియారం స్తంభం రోడ్డును (ఈదరపల్లి వంతెన వైపు) 80 అడుగులు విస్తరించనున్నట్లు చూపించి ఇప్పుడు 56 అడుగుల రోడ్డుకే డ్రెయిన్ నిర్మించడంపై 'సాక్షి' మున్సిపల్ కమిషనర్, డీఈఈని వివరణ కోరింది. డ్రెయిన్ల నిర్మాణం మొదలైంది కాబట్టి ఈ పనులు కొనసాగిస్తున్నామని, భవిష్యత్‌లో నిర్మించే డ్రెయిన్లు మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా నిర్మిస్తామని కమిషనర్ చెప్పారు. అదే డీఈఈని అడిగినప్పుడు మెయిర్ రోడ్డులో (గడియారం స్తంభం రోడ్డు) డ్రెయిన్ నిర్మాణాన్ని నిలిపివేశామని తెలిపారు. మాస్టర్ ప్లాన్‌లో 80 అడుగులు చూపిన కారణంతో వచ్చిన అభ్యంతరాలతో ఈ పనిని ఆపేశామని చెప్పారు. అంటే అటు కమిషనర్, ఇటు డీఈఈ మాస్టర్ ప్లాన్ పరంగా, డ్రెయిన్ల నిర్మాణ పరంగా చెప్పిన మాటల్లో వ్యత్యాసం కనిపించింది. అంటే మాస్టర్ ప్లాన్ అమలును పరిగణనలోకి తీసుకోకుండానే ఈ డ్రెయిన్ల పనులు మొదలు పెట్టారన్న విషయం స్పష్టం అవుతోంది. పట్టణంలో రోడ్ల విస్తరణ జరిగితేనే గాని రోజుకు రోజుకు జటిలమవుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాదు. జిల్లా కేంద్రం అయ్యాక అమలాపురంలో పెరిగిన ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా రోడ్ల విస్తరణ అత్యవసరం.

మెకానిక్‌ల సంక్షేమానికి కృషి చేయాలి

తాళ్లరేవు: నిరంతరం వాహనాలకు మరమ్మతులు చేస్తూ కాలుష్యం బారిన పడి జీవిస్తున్న మెకానిక్‌ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని శ్రీలక్ష్మీ గణపతి సాయి టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాసం కన్నారావు కోరారు. ఆదివారం తాళ్లరేవు ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో సంఘ సమావేశాన్ని నిర్వహించారు. కన్నారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మెకానిక్‌ల సంక్షేమం కోసం జిల్లావ్యాప్తంగా నూతన సంఘాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మెకానిక్‌లకు ఇన్సూరెన్స్ సౌకర్యం, వృత్తిరీత్యా వినియోగదారుల వాహనాలపై వెళ్లేటపుడు పోలీసులు ఎటువంటి ఇబ్బందులు కలుగజేయకుండా చూడాలని కోరారు. 30 మంది మెకానిక్‌లకు ఈశ్రమ్ కార్డులను అందజేశారు. తొలుత మెకానిక్ పితామహుడు గాట్లీబ్ డైమ్లెర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

తాళ్లరేవు మండల నూతన కార్యవర్గం

శ్రీలక్ష్మీ గణపతి సాయి టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ తాళ్లరేవు మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సంఘ నూతన అధ్యక్షుడిగా కొప్పిశెట్టి వీరబ్రహ్మాజీ, కార్యదర్శిగా రాయుడు గోవిందు, కోశాధికారిగా రాజమేను వీరబాబు, ఉపాధ్యక్షుడిగా రాయుడు శ్రీను, సహాయ కార్యదర్శిగా నాటి ధనకామేష్‌లను ఎంపిక చేశారు. నూతన కార్యవర్గ సభ్యులను జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసం కన్నారావు, ఎస్‌కె యాసిన్ అభినందించారు.



మెకానిక్‌లకు ఈశ్రమ్ కార్డులను అందజేస్తున్న సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కన్నారావు, యాసిన్

కూటమి నేతల ఒత్తిడితో ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

- ఆ స్థానంలో టీడీపీ కార్యకర్తకు బాధ్యతలు
- వత్తాసు పలుకుతున్న అధికారులు

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ గెద్దాడ సత్యప్రసాదును వారం రోజుల క్రితం విధుల నుంచి తొలగించారు. ఉపాధి కూలీలకు డబుల్ జాబ్ కార్డుల ద్వారా ఉపాధి కల్పించాలన్న సాకుని కారణంగా చూపి విధుల నుంచి తొలగించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కూటమి నేతలు సత్యప్రసాదుని టార్గెట్ చేశారు. అప్పటి నుంచి పలు రకాలుగా ప్రయత్నాలు చేస్తూ చివరికి విజయం సాధించారు. అయితే అందుకు మండల స్థాయి అధికారులు కూడా సహకరించారు. ఇదే మండలంలో లక్షలాది రుపాయలు ఉపాధి కూలీల డబ్బులను స్వాహా చేసి అవినీతికి పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోవడం మానేసి రెండేసి జాబ్ కార్డులు ఇచ్చారన్న కారణంగా విధుల నుంచి తొలగించడం దారుణమని ఉపాధి కూలీలు అంటున్నారు. సత్యప్రసాదు స్థానంలో ఇదే గ్రామానికి చెందిన కడలి విజయకృష్ణకు ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం కట్టబెట్టేందుకు ఉపాధి అధికారులు పని బాధ్యతలు అప్పగించారు. అయితే విజయకృష్ణకు కుడా రెండు జాబ్ కార్డులు కలిగిఉన్నాడు. రెండు జాబు కార్డులు ఇచ్చారన్న కారణంతో సత్యప్రసాదును తొలగిస్తే, అదే రెండు జాబు కార్డులు ఉన్న విజయకృష్ణకు ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం ఎలా ఇస్తారన్నది అధికారులు చెప్పాల్సి ఉంది. అయితే గ్రామ సర్పంచ్ ఏ సామాజిక వర్గానికి చెందారో ఆదే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం ఇవ్వాలి. అలా అయితే ప్రస్తుత ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం ఎస్సీ సామాజికవర్గానికి కేటాయించవలసి ఉంది. ఉపాధి హామీ పథకం ఆరంభం నుంచి ఇదే నిబంధన కొనసాగుతోంది. ఈ నిబంధనను తుంగలో తొక్కే పనిలో ఉపాధి అధికారులు ఉన్నారని కూలీలు ఆరోపిస్తున్నారు.

దీనిపై ఉపాధి ఏపీఎం రాజామణిని వివరణ కోరగా 16 మందికి రెండేసి జాబుకార్డులు నమోదు చేసి అవినీతికి పాల్పడ్డారని తెలిపారు. మూడు కారణాలతో సత్యప్రసాదుని విధుల నుంచి తొలగించామని తెలిపారు.

ఉగ్రవాదాన్ని తుదముట్టించాలి

- వైఎస్సార్ సీపీ అమలాపురం కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్
- పహల్గామ్ దాడులకు నిరసనగా అమలాపురంలో కొవ్వొత్తుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్, పార్టీ నాయకులు

అమలాపురం టౌన్: ఉగ్రవాదంపై భారత ప్రభుత్వం ఉక్కి పిడికిలి బిగించి తుద ముట్టించాలని అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. కశ్మీర్ రాష్ట్రం పహల్గామ్ లోయల్లో పర్యాటకులపై దాడి చేసిన ఉగ్రవాదుల దుర్మార్గపు చర్యను ఆయన ఖండించారు. అమలాపురం హైస్కూలు సెంటరు నుంచి గడియారం స్తంభం సెంటరు వరకూ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జరిగిన కొవ్వొత్తుల ర్యాలీలో డాక్టర్ శ్రీకాంత్ ప్రసంగించారు. ఉగ్రవాద దాడుల్లో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. దాడుల్లో క్షతగాత్రులైన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకలించేందుకు కేంద్ర ప్రభుత్వం నిఘా, రక్షణ వ్యవస్థలను మరింత పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, అమలాపురం, అల్లవరం ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషగిరిరావు, అమలాపురం జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, అమలాపురం వైస్ ఎంపీపీ పోలమూరి బాలకృష్ణ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వంగా గిరిజ, అమలాపురం మండల పార్టీ అధ్యక్షుడు గుత్తుల చిరంజీవి, అల్లవరం మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, పార్టీ జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు తోరం గౌతమ్ రాజా, పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉండ్రు వెంకటేష్, మున్సిపల్ కౌన్సిలర్ బంగారు గోవింద్, పార్టీ సీనియర్ నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, కుడుపూడి భరత్ భూషణ్, కేతా భాను తేజ, సూదా గణపతి, ఈతకోట శ్రావణ్, చొల్లంగి సుబ్బిరామ్ పాల్గొన్నారు.

ఉగ్రవాద దిష్టిబొమ్మ దహనం

అమలాపురం టౌన్: కశ్మీర్ రాష్ట్రం పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడులకు నిరసనగా కోనసీమ జేఏసీ ఆధ్వర్యంలో అమలాపురం గడియారం స్తంభం సెంటరులో ఆదివారం రాత్రి ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఉగ్రవాదం దిష్టిబొమ్మను కోనసీమ జేఏసీ నాయకులు దహనం చేసి దేశంలో ఉగ్రవాదం నశించాలని నినాదాలు చేశారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు భారత్ గట్టి బుద్ధి చెప్పాలని కోనసీమ జేఏసీ కన్వీనర్ బండారు రామమోహన రావు స్పష్టం చేశారు. ఖబడ్దార్ పాకిస్థాన్ అంటూ హెచ్చరికలు చేశారు. పహల్గామ్ మృతులకు అమరోహ అంటూ నినాదాలు చేశారు. కోనసీమ జేఏసీ ప్రతినిధులు కరాటం ప్రవీణ్, మడికి శ్రీరాములు, యార్లగడ్డ రవీంద్ర, చిక్కం హరిబాబు, ఎస్.సంసోను, మాచిరాజు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ ర్యాలీ

ముమ్మిడివరం: పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ ముమ్మిడివరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలని, సైన్యాన్ని మరింత బలోపేతం చేయాలని, అమాయకులను పొట్టన పెట్టుకున్న వారికి గట్టి బుద్ధి చెప్పాలని వారు డిమాండ్ చేశారు. నగర పంచాయతీ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ సీపీఎం, కేవీపీఎస్ సంఘాల నాయకులు, కార్యకర్తలు, నగర పంచాయతీ కాంట్రాక్టు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పాస్టర్ల కొవ్వొత్తుల ర్యాలీ

అమలాపురం టౌన్: కశ్మీర్ రాష్ట్రం పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో మరణించిన వారికి పలు చర్చిల పాస్టర్లు కొవ్వొత్తుల ర్యాలీ ద్వారా ఆదివారం రాత్రి ఘన నివాళులర్పించారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో పాస్టర్లు తొలుత కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ఉగ్రవాదాన్ని అంతమొందించే వరకు భారత్ పోరాటం చేయాలని స్పష్టం చేశారు. జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.యెహోషువ, జిల్లా సలహాదారు రాజ్‌కుమార్, అమలాపురం మండల పాస్టర్ల సంఘం అధ్యక్షుడు ప్రభుకుమార్, యూపీఎస్ అధ్యక్షుడు స్వర్ణన్‌రాజుతో పాటు పలు చర్చిల పాస్టర్లు, ఫాదర్లు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ...

తాళ్లరేవు: జమ్ము కశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ తాళ్లరేవు, యానాం ప్రాంతాలకు చెందిన మెకానిక్‌లు ర్యాలీ నిర్వహించారు. ఆదివారం స్థానిక ముత్యాలమ్మ ఆలయం నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులు నశించాలి, ఉగ్రదాడికి పాల్పడిన వారిని ఉరితీయాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మెకానిక్ సంఘం నాయకులు దాసం కన్నారావు, ఎస్కే యాసిన్, కొప్పిశెట్టి వీరబ్రహ్మాజీ, రాయుడు గోవిందు, రాజమేను వీరబాబు, రాయుడు శ్రీను పాల్గొన్నారు.



అమలాపురంలో ఉగ్రవాదం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కోనసీమ జేఏసీ ప్రతినిధులు



ముమ్మిడివరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు



అమలాపురంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

నాగేశ్వరరావు సేవలు అభినందనీయం

అమలాపురం రూరల్ : సాకుర్రు గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి కరణం అజ్జవరపు నాగేశ్వరరావు సేవలు అభినందనీయమని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఆదివారం సాకుర్రు గ్రామంలో నాగేశ్వరరావు సంతాప సభ జరిగింది. గొల్లపల్లి మాట్లాడుతూ తనకు 30 ఏళ్లుగా నాగేశ్వరరావుతో స్నేహబంధం ఉందన్నారు. ఆయన మృతి చెందడం బాధాకరమని అన్నారు.

ఈసభలో అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ రూరల్ అధ్యక్షుడు గుత్తులు చిరంజీవిరావు, వైస్ ఎంపీపీ పోలమూరి బాలకృష్ణ, రూరల్ మండల యువజన విభాగం అధ్యక్షుడు కేతా భానుతేజ, మాజీ సర్పంచ్ ములపర్తి సత్యనారాయణ, పెచ్చెట్టి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి, వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ శ్రీకాంత్

ఎమ్మెల్యేను కలిసిన రోడ్డు విస్తరణ బాధితులు

అమలాపురం టౌన్: మాస్టర్ ప్లాన్ అమలులో చేపట్టే రోడ్డు విస్తరణ పనుల్లో తమ ఇళ్లు కోల్పోతామని పలు ప్రాంతాలకు చెందిన బాధితులు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును ఆదివారం కలిసి వినతి పత్రం అందించారు. శ్రీరామపురం, మద్దాలవారిపేట, విత్తనాల వారి కాల్వగట్టు మీదుగా జాతీయ రహదారిని కలుపుతూ 60 అడుగుల మేర విస్తరించేందుకు మాస్టర్‌ప్లాన్‌లో చూపించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి తమ రోడ్డులో 60 అడుగుల విస్తరణ సరికాదని, అదే జరిగితే చాలా ఇళ్లే మాయం అవుతాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డును 60 అడుగులు కాకుండా 40 అడుగులు మాత్రమే విస్తరించేలా చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.

ఎప్పుడు ఊడేనో... ఎవరికి మూడేనో...

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి, అమలాపురం ప్రధాన పంట కాలువపై ఉన్న సరిపల్లి వంతెన ప్రమాదకరంగా మారింది. ఈ వంతెన నిర్మించి దశాబ్దాలు గడవటంతో వంతెనకు ఇరువైపులా ఉన్న రైలింగ్ శిథిలావస్థకు చేరింది. ఈ వంతెనను ఆనుకుని ఒకవైపు అమలాపురం, చల్లపల్లి ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి ఉంది. ఈ మార్గం గుండా చల్లపల్లి, ఎస్.యానం గ్రామాల నుంచి జిల్లా కేంద్రం అమలాపురానికి ప్రతీరోజు వందలాది మంది ప్రయాణిస్తుంటారు. అటుగా ప్రయాణించే ప్రజలకు ఆ రైలింగ్ చూసినప్పుడల్లా అది ఎప్పుడు ఊడేనో ఎవరికి మూడేనో అంటూ భయాందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సరిపల్లిలో ప్రమాదకరంగా మారిన వంతెన రైలింగ్

నేటి నుంచి స్కూళ్లకు సెలవులు

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్‌లలో ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలకు వేసవి ఎండల దృష్ట్యా సెలవులు ప్రకటించినట్లు ఆదివారం విద్యాశాఖామంత్రి నమశ్శివాయం ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి జూన్ 1 వరకు సెలవులు ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

2 నుంచి చిల్డ్రన్స్ క్లబ్ సమ్మర్ క్యాంప్



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశ్వరరావు

తాళ్లరేవు: ఏటా తాళ్లరేవు చిల్డ్రన్స్ క్లబ్ ద్వారా నిర్వహించే వేసవి వినోదం (సమ్మర్ క్యాంప్ 2025) మే 2 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. వేసవి సెలవుల్లో చిన్నారులు మొబైల్ ఫోన్, ఇతర వ్యసనాలకులోను కాకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో వినోదంతోపాటు విజ్ఞానాన్ని అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని క్లబ్ ప్రతినిధి మల్లేశ్వరరావు తెలిపారు. వీటిలో భాగంగా ఆటలు, పాటలు, చిత్రలేఖనం, నీతికథల పోటీలు ఉంటాయన్నారు. పేకేటి సతీష్, అత్తిలి బాబూరావు, వడ్డి ఏడుకొండలు, పాలిక శ్రీనివాస్, టి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

యానాం: రాజకీయ పార్టీలు భారత ఎన్నికల సంఘం వద్ద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పుదుచ్చేరి కలెక్టర్ కులుంగొత్తన్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ అనంతరం కామన్ పర్మినెంట్ సింబల్ అందజేస్తారన్నారు. కాగా గుర్తింపు పొందని రాజకీయపార్టీలను గుర్తించి భారత ఎన్నికల సంఘానికి నివేదిక పంపనున్నారు.


బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు

అమలాపురం రూరల్: అమలాపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎస్సై బాలాజీ బృందంతో మండలంలో దాడులు నిర్వహించారు. గున్నేపల్లి అగ్రహారంలో కేతా సాయిబాబు పరిమితికి మించి మద్యం సీసాలు కలిగి ఉండటం వల్ల గుర్తించి అరెస్టు చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్టు సీఐ సత్యనారాయణ తెలిపారు.

అంబేడ్కర్ జీవితం యువతకు ఆదర్శం

యానాం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక అంబేడ్కర్‌నగర్‌లో 134వ అంబేడ్కర్ జయంతి వేడుకలను రాంజీ యంగ్‌మెన్స్ క్లబ్, గ్రామస్తులు, మహిళల ఆధ్వర్యంలో నిర్వహించారు.

అయినవిల్లిలో భక్తుల సందడి



ప్రత్యేక అలంకరణలో విఘ్నేశ్వరస్వామి

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయక రావు ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ వంటి విశేష పూజలు జరిపారు. అర్చకులు స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామికి మహానివేదన చేశారు. సాయంత్రం ఎనిమిది గంటలకు విశేష సేవలు చేసి ఆలయ తలుపులు వేశారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 18 మంది, లక్ష్మీగణపతి హోమంలో 25 జంటలు, స్వామివారి పంచామృతాభిషేకాల్లో ఒక జంట, స్వామివారి స్వామివారి గరిక పూజలో ఇరువురు జంటలు పాల్గొన్నారు. ఇరువురికి తులాభారం, ఒకరికి నామకరణ చేశారు. అన్నప్రాశన ఐదుగురు చిన్నారులకు నిర్వహించారు. స్వామికి 4 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. ఆరు నూతన వాహనదారులు పూజలు చేయించుకున్నారు. 2700 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఒక్క రోజు స్వామికి వివిధ పూజా టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,64,385లు ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.